క్లుప్తంగా

ఎమ్మెల్సీ కవితను కలిసిన ఎమ్మెల్యే ముత్తిరెడ్డి


కవిత ఇంటి నుంచి బయటకు వస్తున్న ముత్తిరెడ్డి

జనగామ: జనగామ బీఆర్ఎస్ టికెట్ కేటాయింపులో నెలకొన్న సందిగ్ధత నేపథ్యంలో ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి సోమవారం ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. తన టికెట్ కోసం ఇతరులు ప్రయత్నం చేస్తున్నారని కవితతో చెప్పుకొచ్చినట్లు సమాచారం. రెండో జాబితాలో తన పేరు ఉండేలా చూడాలని అభ్యర్థించినట్లు పార్టీ వర్గాలో చర్చ జరుగుతోంది. కవితతో మాట్లాడిన ముత్తిరెడ్డి అక్కడ నుంచి నేరుగా ప్రగతి భవన్‌కు చేరుకొని ముఖ్య నేతలను కలిసినట్లు సమాచారం.

కాంగ్రెస్ పాలకుర్తి టికెట్ కోసం తిరుపతిరెడ్డి దరఖాస్తు



దేవరుప్పుల: పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ పక్షాన ఎమ్మెల్యే అభ్యర్థి టికెట్ ఆశిస్తున్న కాంగ్రెస్ ఎన్ఆర్ఐ సెల్ కన్వీనర్ డాక్టర్ ఎర్రం రెడ్డి తిరుపతిరెడ్డి సోమవారం గాంధీ భవన్‌లో దరఖాస్తు చేసినట్లు జిల్లా కాంగ్రెస్ నాయకులు అల్లం ప్రదీప్‌రెడ్డి తెలిపారు. మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్ చంద్రా రెడ్డి, పాకనాటి రాహుల్ రెడ్డి, వీరారెడ్డి దామోదర్, నరేష్ పరశురాములు ఉన్నారు.

రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వృకోధర్‌రెడ్డి



లింగాలఘణపురం: తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మండలంలోని నాగారం గ్రామానికి చెందిన జనగామ వృకోధర్‌రెడ్డిని నియమించారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ భవన్‌లో ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించిన టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

దేశాయితండాలో వైద్యశిబిరం

చిల్పూరు: లేబర్ కార్డు కలిగిన ప్రతీ ఒక్కరి ఆరోగ్యం కోసమే వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ భూక్య సోనియా అన్నారు. మండలంలోని దేశాయితండాలో సోమవారం లేబర్ ఆఫీస్ నుంచి గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని సర్పంచ్ ప్రారంభించారు.

చర్య తీసుకోవాలి

పాలకుర్తి టౌన్: హైదరాబాద్‌లో గిరిజన మహిళ లక్ష్మీభాయిపై థర్డ్ డిగ్రీ ప్రయోగించిన పోలీసులపై చర్య తీసుకోవాలని ఎరుకల హక్కుల పోరాట సమితి నాయకుడు సాయిలు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అతి దారుణంంగా వ్యవహరించిన పోలీసులపై చర్య తీసుకోవాలన్నారు. రక్షించాల్సిన పోలీసులు ఆమె ను శిక్షించారన్నారు. ఎల్‌బీ నగర్ పోలీసులపై వెంటనే కేసు నమోదు చేయాలని సాయిలు కోరారు.

వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి

జనగామ రూరల్: హమాలీ కార్మికుల సంక్షేమం కోసం తక్షణమే వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని ఆల్ హమాలీ వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి రాపర్తి రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ప్రజావాణిలో అదనపు కలెక్టర్ సుభాషినికి హమాలీ యూనియన్ జిల్లా నాయకులతో కలిసి వినతి పత్రం అందజేశారు. ఆల్ హమాలీ వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయూ) జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చిట్యాల సోమన్న, జిల్లా సహాయ కార్యదర్శి బాలరాజ్, జిల్లా నాయకులు పాండ్యాల అంజయ్య, జి.రాజు శ్రీనివాస్ పాల్గొన్నారు.

జనగామలో రెచ్చిపోతున్న దొంగలు

- ఒకేరోజు రెండిళ్లలో చోరీ
- బైక్, రూ.50 వేల నగదు అపహరణ


సీసీ ఫుటేజీలో నిక్షిప్తమైన నిందితుడు (ఫైల్)

జనగామ: జనగామలో దొంగలు రెచ్చిపోతున్నారు. తాళాలు వేసి ఉన్న ఇళ్లను టార్గెట్ చేస్తున్న దొంగలు దైవదర్శనానికి వెళ్లిన రెండిళ్లలో చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటనలు ఆలస్యంగా వెలుగులోకి వచ్చాయి. జిల్లా కేంద్రంలోని బాలాజీనగర్‌కు చెందిన మధుమోహన్ కుటుంబం ఈనెల 16న తిరుపతికి వెళ్లగా ఈనెల 20న దొంగలు వరండాలో ఉన్న ద్విచక్ర వాహనాన్ని చోరీ చేశారు. అదే రోజు కూరగాయల వ్యాపారి లక్ష్మీ ఇంట్లో విలువైన వస్తువులతోపాటు రూ.2.50 లక్షల నగదు ఎత్తుకెళ్లారు. పోలీసులు విచారణ చేస్తున్నారు. సీసీ కెమెరాల ఫుటేజీని సేకరిస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో నాగుల పంచమి


జనగామ: సీతారామచంద్రస్వామి ఆలయంలో..


జనగామ: గుండ్లగడ్డ ఉమామహేశ్వర ఆలయంలో..


నర్మెట: పురాతన శివాలయంలో భక్తుల పూజలు

సాక్షి నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా సోమవారం నాగులపంచమి వేడుకలను ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆలయాలతో పాటు స్వగృహంలో వెండి, రాగి, రాతి చెక్కలతో తయారు చేసిన నాగపడిగెలకు అభిషేకాలు చేసి, నైవేద్యం సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం నాగ అష్టోత్తరం, నాగస్తోత్రం, నాగస్తుతి, నాగేంద్ర సహస్రనామాలతో స్వామిని ప్రార్థించారు. నాగపంచమి రోజున ఇంటికి వచ్చిన ముత్తైదువులకు నాగేంద్ర నిత్యపూజ, నాగదోష పరిహారం పుస్తకాలతో పాటు తాంబూలాలు, పసుపు, కుంకుమలతో వాయినం ఇచ్చారు. సుబ్రహ్మణ్య స్వామి విగ్రహానికి పంచామృతాలతో అభిషేకంతో పాటు శ్రీ రామనాథ స్వామికి రుద్రాభిషేకాలు జరిపారు.

పుట్టలో పాలుపోసి..

జిల్లా కేంద్రంలోని ఆలయాలతోపాటు, పలు మండలాల్లోని ఆలయాలకు భక్తులు పోటెత్తారు. అధిక సంఖ్యలో తరలివచ్చిన మహిళలు, భక్తులు పుట్టలో ఆవుపాలు పోసి తమ భక్తిని చాటుకున్నారు.


బచ్చన్నపేట: ఆలయంలో పూజ చేస్తున్న భక్తులు


జనగామ: పోచమ్మ ఆలయంలో పూజ చేస్తున్న భక్తులు


జనగామ: పోచమ్మతల్లికి..


జనగామ: బాలాజీనగర్ శ్రీరేణుక ఎల్లమ్మ గుడిలో..


స్టేషన్‌ఘన్‌పూర్: నాగమయ్య పుట్ట వద్ద..

వైభవంగా ప్రతిష్ఠాపన



కొడకండ్ల: మండలంలోని రేగులలో శివలింగ ప్రతిష్ఠాపన సోమవారం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఎర్రబెల్లి ట్రస్ట్ చైర్‌పర్సన్ ఉషాదయాకర్‌రావు పాల్గొని పూజలు నిర్వహించారు. పాడిపంటలు, ఆయురారోగ్యాలతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ఆమె కోరారు. సర్పంచ్ కల్నాని వెంకట్‌రెడ్డి, ప్రజలు పెద్ద ఎత్తున ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొన్నారు.

బీటీ రోడ్లు మంజూరు

బచ్చన్నపేట: మండలంలోని పలు గ్రామాలకు బీటీ రోడ్లు మంజూరు అయ్యాయని ఎంపీపీ బావండ్ల నాగజ్యోతికృష్ణంరాజు తెలిపారు. సోమవారం మాట్లాడుతూ సీఆర్ఆర్ గ్రాంట్ నుంచి బచ్చన్నపేట మండలంలోని మాజీ ఎమ్మెల్సీ బోడకుంటి వెంకటేశ్వర్లు వ్యవసాయ బావి నుంచి కట్కూర్ గ్రామం వరకు 4 కిలోమీటర్లు, అలాగే కొన్నె గ్రామంలోని నర్సింహ్మస్వామి దేవాలయం నుంచి ఇటుకాలపల్లి వరకు 5 కిలోమీటర్లు బీటీ రోడ్డు వేసేందుకు నిధులు మంజూరు అయినట్లు తెలిపారు. ఈ పనులకు త్వరలో టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తారని తెలిపారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి


మాట్లాడుతున్న డాక్టర్ ప్రీతి

కొడకండ్ల: విద్యార్థులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ఆయుర్వేదిక్ డాక్టర్ ప్రీతి సూచించారు. సోమవారం ఆచార్య చరక్ జయంతిని పురస్కరించుకొని మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాలలో వైద్య శిబిరం నిర్వహించారు. సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు పాటించాలని, వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి సుదర్శన చూర్ణం, అశ్వగంధ చూర్ణం, మందులను పంపిణీ చేశారు. కోటి, ఉపాధ్యాయ సిబ్బంది వెంకటాద్రి, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

మన్‌సాన్‌పల్లిలో వైద్యశిబిరం

బచ్చన్నపేట: మండలంలోని మన్‌సాన్‌పల్లిలో ఆయుర్వేద వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ పంజాల తార తెలిపారు. సోమవారం గ్రామంలోని జీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన శిబిరంలో పలువురు గ్రామస్తులు పరీక్షలు చేసుకొని మందులు తీసుకున్నారు. నాయకులు పంజాల శ్రీధర్, పంచాయతీ కార్యదర్శి కిరణ్‌కుమార్, వైద్యులు పాల్గొన్నారు.

ప్రమాణస్వీకారానికి తరలిన నాయకులు

కొడకండ్ల: ఆరోగ్యశ్రీ ట్రస్ట్ చైర్మన్‌గా డాక్టర్ నెమరుగొమ్ముల సుధాకర్‌రావు ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి సోమవారం బీఆర్ఎస్ మండల నాయకులు, ప్రజాప్రతినిధులు తరలివెళ్లారు. కొడకండ్ల సర్పంచ్ పసునూరి మధుసూదన్, మార్కెట్, దేవస్థాన డైరెక్టర్లు కుందూరు అమరేందర్‌రెడ్డి, కుమార్‌గౌడ్, దూలం సతీష్‌గౌడ్, గునిగంటి వెంకటేశ్వర్‌రావు, వెంకన్న తదితరులు హైదరాబాద్‌కు వెళ్లి డాక్టర్‌సాబ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

సుధాకర్‌రావుకు శుభాకాంక్షలు

దేవరుప్పుల/పాలకుర్తి : ఆరోగ్య శ్రీ హెల్త్ కేర్ ట్రస్టు చైర్మన్‌గా నియమితులైన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సాబ్ నెమరుగొమ్ముల సుధాకర్‌రావు సోమవారం హైదరాబాద్‌లో బాధ్యతలు చేపట్టగా పంచాయతీరాజ్ శాఖ మంత్రి దయాకర్‌రావు, ఎర్రబెల్లి ట్రస్టు చైర్‌పర్సన్ ఉషారాణి, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు తీగల దయాకర్, మొలుగూరి రమేష్, పల్ల సుందర్‌రామిరెడ్డి, కొత్త జలంధర్‌రెడ్డి, రమేష్, శ్రీనివాస్‌రెడ్డి, జాకీర్, చింత రవి, హన్మంతు, కూతాటి నర్సింహ్మలు, సాయిలు, ఎన్నం చంద్రమౌళి, జెడ్పీటీసీ సభ్యుడు పుస్కూరి శ్రీనివాసరావు, పాలకుర్తి సర్పంచ్ యాకాంతరావు, కోఆప్షన్ సభ్యుడు ఎం.డి మదార్ , ఎర్రబెల్లి రాఘవరావు పాల్గొన్నారు.


సుధాకర్‌రావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న మంత్రి ఎర్రబెల్లి, పార్టీ శ్రేణులు


శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

కార్యకర్తలతో కలిసి పనిచేయాలి


మాట్లాడుతున్న ఉపేందర్‌రెడ్డి

బచ్చన్నపేట: మండలంలోని ప్రతి అధికార పార్టీ నాయకుడు అధికార పార్టీ నాయకులతో కలిసి పని చేయాలని బీఆర్ఎస్ పార్టీ మండల యూత్ అధ్యక్షుడు వడ్డెపల్లి ఉపేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. ఇటీవల చాలా మంది నాయకులు ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డితో ఎదిగిన నాయకులే అనవసరమైన ప్రచారాలు చేస్తున్నారని అన్నారు. జనగామ నియోజకవర్గ అభ్యర్థిగా ముత్తిరెడ్డి వద్దని గతంలో ఎమ్మెల్సీ పోచంపెల్లి శ్రీనివాస్‌రెడ్డి ఇంటి చుట్టూ మండల నాయకులు ప్రదక్షిణలు చేశారని అన్నారు. ఇటీవల రాష్ట్ర సీఎం కేసీఆర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి పేరును ప్రస్తావించడంతో చాలా మంది అటు వైపు చూస్తున్నారని అన్నారు. ఇక ముందు కూడా మండలం పేరు చెప్పి వెళ్లే నాయకులను ఆదరించకూడదని బీఆర్ఎస్ పార్టీ నాయకులు అందరం కూర్చొని మనకు సేవచేసే నాయకుడిని గుర్తించి గెలించుకుందామని తెలిపారు. మండల కోఆప్షన్ మెంబర్ షబ్బీర్, పట్టణ అధ్యక్షుడు గందమల్ల నరేందర్, నాయకులు జావీద్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ శ్రేణుల సంబురాలు


చిల్పూరు: చిన్నపెండ్యాలలో సంబురాల్లో కార్యకర్తలు


రఘునాథపల్లిలో ర్యాలీ

సాక్షి, నెట్‌వర్క్: ముఖ్యమంత్రి కేసీఆర్ పాలకుర్తి, స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థులుగా మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్సీ కడియం శ్రీహరిని ప్రకటించడంపై బీఆర్ఎస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తూ సోమవారం సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా డప్పుచప్పుళ్లు, డిజే సౌండ్ సిస్టంతో పాటు బాణసంచాలు పేల్చి భారీ ర్యాలీ నిర్వహించి స్వీట్లు పంచిపెట్టారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కృష్ణారెడ్డి, నాయకులు రాష్ట్ర రైస్ మిల్లర్ల అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బెలిదె వెంకన్నగుప్తా, చింతకుంట్ల నరేందర్‌రెడ్డి, రాపోలు మధుసూధన్‌రెడ్డి, లింగారెడ్డి, మారేపల్లి శ్యాంకుమార్‌రెడ్డి, వంశీధర్‌రెడ్డి, చిట్ల స్వరూపరాణిభూపాల్‌రెడ్డి, జనగాం యాదగిరి, ఇల్లందుల సుదర్శన్, మారుజోడు రాంబాబు, అబ్బాస్ అలి, పురుషోత్తం , చిదిరాల ధనుంజయ, గుగ్గిళ్ల యాకయ్య, కాటబత్తిని రమేష్, తదితరులు పాల్గొన్నారు.


ఘన్‌పూర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు


జఫర్‌గఢ్‌లో..


లింగాలఘణపురం: మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న కడియం శ్రీహరి వర్గీయులు


లింగాలఘణపురం: అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న జెడ్పీటీసీ వంశీధర్‌రెడ్డి

మోదీ పాలనలోనే సమగ్రాభివృద్ధి


మాట్లాడుతున్న హుబ్లీ ఎమ్మెల్యే మహేష్

దేవరుప్పుల: పీఎం మోదీ పరిపాలనలోనే భారత దేశంలో సమగ్రాభివృద్ధి సాధ్యమైందని బీజేపీ పాలకుర్తి నియోజకవర్గ కేంద్ర పరిశీలకులు, కర్ణాటక రాష్ట్ర హుబ్లీ సెంట్రల్ ఎమ్మెల్యే మహేష్ తెంగినకై అన్నారు. సోమవారం మండల కేంద్రంలో బీజేపీ మండల కార్యాలయంలో మండల అధ్యక్షుడు బాగాల నవీన్‌రెడ్డి అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో రాజకీయాలకతీతంగా కేంద్రం నిధులు మంజూరు చేస్తేనే తెలంగాణ ప్రాంతంలో పల్లెప్రగతి వంటి శాశ్వత ప్రాతిపదిక పనులు ఆచరణాత్మకంగా అమలయ్యాయన్నారు. అనంతరం సీతారాంపురం అనాథ శరణాలయంలో పండ్లు పంపిణీ చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంత రెడి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లేగ రామ్మోహన్ రెడ్డి, పెదగోని సోమయ్య, శిక్షణ తరగతుల ఇన్‌చార్జ్ పాకనాటి దామోదర్ రెడ్డి , నియోజకవర్గ కన్వీనర్ పూసల శ్రీమాన్, జాయింట్ కన్వీనర్ కోటేశ్వర్, జిల్లా ఉపాధ్యక్షుడు రంగురాము తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ అధికారంలో ఉంటేనే అభివృద్ధి

చిల్పూరు: కేంద్రంలో, రాష్ట్రంలో బీజేపీ అధికారంలో ఉంటేనే అభివృద్ధి సాధ్యమవుతుందని కర్ణాటక రాష్ట్రంలోని కుంద్గోల్ నియోజకవర్గం ఎమ్మెల్యే ఎంఆర్ పాటిల్ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం బీజేపీ ఎమ్మెల్యే ప్రవాస్ యోజన కార్యక్రమం పార్టీ మండల అధ్యక్షుడు పెండ్యాల దిలీప్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పాటిల్ మాట్లాడారు. డాక్టర్ గుండె విజయరామారావు, కపిలవాయి దిలీప్‌కుమార్, మాదాసు వెంకటేష్, బొజ్జపల్లి సుబాష్, ఐలోని అంజిరెడ్డి, గాలి రాజు, గుగులోతు మధు, గొల్లపల్లి వాసు, పన్నీరు అశోక్, బాల్నె శ్రీనివాస్, బాణాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పట్టణ, మండల కమిటీలు కొనసాగుతాయి

జనగామ: జనగామ కాంగ్రెస్‌లో నూతన కమిటీలను ప్రకటించే వరకు ప్రస్తుత పట్టణ, మండల కమిటీలు అలాగే కొనసాగుతాయని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ధర్మపురి శ్రీనివాస్ అన్నారు. సోమవారం ఆయన ఇక్కడ మాట్లాడుతూ కాంగ్రెస్ విధివిధానాలు తమకు తెలుసన్నారు. కమిటీలను రద్దు చేస్తున్నట్లు డీసీసీ అధ్యక్షుడు ప్రకటన చేయడం హాస్యాస్పదమన్నారు. కొత్తగా కమిటీలు వేసే సమయంలో బూత్ స్థాయి నేతల నుంచి గ్రామ, మండల, పట్టణ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో చర్చించి, వారి నుంచి అభిప్రాయాలను సేకరించి, పీసీసీకి పేర్లు పంపించి ఆమోదం పొందాల్సి ఉంటుందన్నారు. ఏకపక్షంగా తీసుకునే నిర్ణయం ఉండదన్నారు.

ఎన్ఎస్‌యూఐ కృషితోనే బస్‌పాస్ కౌంటర్

స్టేషన్‌ఘన్‌పూర్: ఎన్ఎస్‌యూఐ కృషి ఫలితంగానే ఘన్‌పూర్ బస్టాండ్‌లో బస్‌పాస్ కౌంటర్ ఏర్పాటు చేశారని ఎన్ఎస్‌యూఐ ఘన్‌పూర్ నియోజకవర్గ అధ్యక్షుడు షేక్ జానీ అన్నారు. విద్యార్థుల సౌకర్యం కోసం వరంగల్-1 డిపో మేనేజర్ సంతోష్ ఆదేశాల మేరకు ఘన్‌పూర్ బస్టాండ్‌లో సోమవారం బస్‌పాస్ కౌంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి జానీ బస్‌పాస్ సెంటర్‌ను సందర్శించారు. ఘన్‌పూర్‌లో బస్‌పాస్ కౌంటర్ లేకపోవడంతో విద్యార్థులు బస్‌పాస్‌ల కోసం ప్రతీ నెలా హనుమకొండకు వెళ్లి ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఈ విషయమై టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింగపురం ఇందిర ఆదేశాల మేరకు ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో బస్‌పాస్ కౌంటర్ సమస్యను ఆర్టీసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. సానుకూలంగా స్పందించి ఘన్‌పూర్‌లో బస్‌పాస్ కౌంటర్ ఏర్పాటు చేసినందుకు డిపో మేనేజర్‌కు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.


విద్యార్థులకు బస్‌పాస్‌లు అందజేస్తున్న ఆర్టీసీ సిబ్బంది

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

కొడకండ్ల: మండలకేంద్రంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు లయన్ దామెర నరేష్ సహకారంతో విద్యార్థులకు సోమవారం నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. క్లబ్ చైర్మన్ పేరం రాము మాట్లాడుతూ స్థానికంగా లయన్స్‌క్లబ్ ఏర్పాటైన తర్వాత మొదటి సేవా కార్యక్రమాన్ని చేపట్టామని, ఇదే స్ఫూర్తితో మరిన్ని సేవా కార్యక్రమం నిర్వహించి కొడకండ్ల లయన్స్‌క్లబ్‌ను ఆదర్శంగా నిలుపుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఈజీఎస్ రాష్ట్ర డైరెక్టర్ యాకయ్య, సెక్రటరి దోర్నం ప్రభాకర్, ట్రెజరర్ గాజుల రాములు, హెచ్ఎం విజయనిర్మల, లయన్స్‌క్లబ్ డైరెక్టర్లు కోటి, ఆసిఫ్, సుదర్శన్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.


నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్న క్లబ్ ప్రతినిధులు

'అక్రమార్కులకే బీఆర్ఎస్ టికెట్'



చిల్పూరు : అక్రమార్కులకే బీఆర్ఎస్ అధిష్ఠానం టికెట్ ఇచ్చిందని మాజీ మంత్రి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండె విజయరామారావు తెలిపారు. మండలంలోని ఫతేపూర్ ఎస్టీ మోర్చా నాయకుడు గుగులోత్ మధు నివాసంలో సోమవారం ఆయన భోజనం చేస్తూ విలేకరులతో మాట్లాడారు. త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి సీఎం కేసీఆర్ ప్రకటించిన అభ్యర్థుల్లో అత్యధికులు సెటిల్‌మెంట్లు, రియల్టర్లు, ప్రజావ్యతిరేకత ఉన్న వారే ఉండడం చూసి ప్రజలు ఆశ్చర్యపోతున్నారని చెప్పారు. తెలంగాణ కోసం పోరాడిన ఉద్యమకారులను విస్మరించి ప్రజావ్యతిరేకులకు, అధిష్ఠానానికి తొత్తులుగా వ్యవహరించే వారికి బీఆర్ఎస్ టికెట్ కేటాయించడం బీజేపీకే లాభం చేకూర్చనుందని తెలిపారు. బొజ్జపల్లి సుభాష్, గంటి ఉపేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.